హైదరాబాద్ వార్త

# సెటిలర్లే కీలకమా..?

- హైదరాబాద్‌లోని సెటిలర్ ఓటర్ల మద్దతు ఎవరికో?
- గెలుపు ఓటములను శాసించే సత్తా సెటిలర్లకుంది
- సెటిలర్లను మద్దతు కోసం పరితపిస్తున్న పార్టీలు



నార్సింగి, నవంబర్ 22 ప్రభాతవార్త : హైదరాబాద్ మహానగర శివారుల్లో ఉన్న 10.నియోజకవర్గాలలో సెటిలర్ ఓటర్లు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు, ఓటములను శాసించేలా కనిపిస్తున్నారు. 10నియోజకవర్గాలలో సుమారు 16.లక్షల మంది సెటిలర్ ఓటర్లు ఉన్నట్లు రాజకీయ నేతలు అంచనా వేస్తున్నారు. స్థానికుల ఓట్లతో పాటు సెటిటర్ ఓట్లను పొందిన వారే ఈ దఫా అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధిస్తారని, సెటిలర్లను పట్టించుకోని పార్టీలకు సైలెంట్‌గా ఓటుతో పోటు పొడిచేందుకు వారంతా కంకణబద్ధులయ్యారు. శేరలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఎల్‌బినగర్, మల్కాజ్‌గిరి, మేడ్చెల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, పటాన్‌చెరువు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో తమ సత్తాను చాటేందుకు సెటిలర్ ఓటర్లు, ఐటీ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ఉత్తర భారతానికి చెందిన ఓటర్లతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓటర్లు బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపు ఓటములను శాసించే స్థాయిలో ఉన్నారు. చాలా వరకు ఉత్తర భారతానికి చెందిన ఓటర్లు బిజెపి వైపు ఆకర్షితులవుతుండగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓటర్లు కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లకు అండగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సమైక్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో హైటెక్‌సిటీని కట్టించి ఐటీ పరిశ్రమకు పునాదులు వేశారు. అప్పటి నుంచే ఐటీ కంపనీలు హైదరాబాద్‌కు రావడం ప్రారంభించాయి. ఈ ఐటీ కంపనీలు దినదినాభివృద్ధి చెంది ఇప్పుడు హైదరాబాద్ మహా నగరానికి పెద్ద ఎత్తున ఆదాయంను సమకూరుస్తున్నాయి. తెలంగాణకు ఆదాయాన్ని సమకూర్చే బంగారు బాతుల్లాగా మారాయి. ఈ ఐటీ పరిశ్రమలే లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. దీనంతటికి కారకులైన చంద్రబాబు నాయుడు ఇటీవల జైలుకెళితే... ఇక్కడి ఐటీ ఉద్యోగులు, సెటిలర్లు చంద్రబాబుకు అండగా రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేస్తుంటే ఇక్కడి ప్రభుత్వం వారిపై కఠినంగా వ్యవహరించింది. దీంతో ఐటీ ఉద్యోగులు, సెటిలర్లలో అధికార పార్టీపై కొంత వ్యతిరేక భావన ఏర్పడింది. ఇది గమనించిన బిఆర్‌ఎస్ మంత్రులు కేటీఆర్, తలసాని, మల్లారెడ్డిలు సీనియర్ ఎన్టీఆర్ సేవలను కొనియాడుతూ సెటిలర్ల కోపాన్ని చల్లార్చే ప్రయత్నం చేశారు. ఇంతలో టిడిపి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయకూడదని నిర్ణయం తీసుకోవడంతో టిడిపి ఓటర్లు అంతా కాంగ్రెస్ వైపుకు మళ్లారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఇదే క్రమంలో ఐటీ ఉద్యోగులు, సెటిలర్లు కూడా కాంగ్రెస్ వైపుకు చూస్తున్నట్లు రాజకీయ పరిశీల కులు అంచనా వేస్తున్నారు. ఇదే కనుక జరిగితే అధికార బిఆర్‌ఎస్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలేలా కనిపిస్తుంది. సహజంగానే వరుసగా రెండు మార్లు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్‌కు జనాలలో వ్యతిరేకత ఉంటుంది. ఇప్పటికే ఆ వ్యతిరేకతను తగ్గించుకునేందుకు బిఆర్‌ఎస్ పార్టీ మల్లగుల్లాలు పడుతుంది. చంద్రబాబు అరెస్టు సమయంలో తెలంగాణ సర్కారు పెద్దలు కొందరు ఐటీ ఉద్యోగుల ఆందోళనల పట్ల చేసిన ప్రకటనలు, తీసుకున్న నిర్ణయాలు బిఆర్‌ఎస్‌కు నష్టం చేసే ప్రమాదం పొంచి ఉంది. మంత్రులు నష్ట నివారణ కోసం ఆంధ్రా నేతలను కొనియాడుతున్నా, సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నా ఎంత వరకు ఐటీ ఉద్యోగులు, సెటిటర్ల మనసులు గెలుచుకుంటారో ఎన్నికలలో వచ్చే ఫలితాలు తెలుస్తాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంమ్మీద అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న అన్ని పార్టీల అభ్యర్థులు సెటిలర్లు, ఐటీ ఉద్యోగుల ఓట్లను పొందేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు.

## నేటి నుంచి తార్నాకలో ఐనోన్ కృపా పండుగలు

తార్నాక, నవంబర్ 22 ప్రభాతవార్త: తార్నాకలోని ఐనోన్ చర్చి ఆద్వర్యంలో ఈ నెల 23 నుంచి కృపా పండుగలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రెవరెండ్ విలియం కేరి బుధవారం వెల్లడించారు. ఈ నెల 23 నుంచి 26 వరకు తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్లో ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి సువార్త సభలు జరుగుతాయని దీంతో పాటు ఉదయం ప్రతి రోజు 9 గంటలకు ద గుడ్ షెపర్డు పాస్టర్స్,లీడర్స్ కాన్ఫరెన్ ఉంటుందన్నారు. ఈ సభలో రెవ.విలియం కేరితో పాటు ఆర్ అభిషేక్ పాల్ ప్రసంగిస్తారని తెలిపారు.



# గోపన్‌పల్లి ఫ్లైఓవర్ నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో..?

**నిత్య నరకం చూస్తున్న స్థానికులు ● ఆర్‌టిఐలతో ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రజలు**

**ఐటి కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన గోపన్‌పల్లి ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు నేటికి పూర్తి కాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదట పిల్లర్ల వరకు నిర్మాణం జరిగిన తరువాత పనులు చాలా రోజుల పాటు నిలిచిపోగా, స్థానికుల ఆందోళనలతో స్పందించిన అధికారులు తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ పనులు నత్తనడకన సాగుతుం డడంతో మొత్తం పనులు పూర్తయి ఎప్పటికి ప్రజలకు అందుబాటులోకి వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.**



నత్తనడకన సాగుతున్న గోపన్‌పల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

గచ్చిబౌలి, నవంబరు 22 ప్రభాతవార్త : గచ్చిబౌలి ఐటి కారిడార్‌కు అనుసంధానమైన రహదారుల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఆర్‌డిపి ప్రాజెక్టులో భాగంగా కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నగరంలోని కూకట్‌పల్లి, మియాపూర్ మీదుగా ఐటి కారిడార్‌కు వచ్చే ప్రయాణికుల రద్దీని కొండాపూర్ గచ్చిబౌలి మీదుగా తగ్గించేందుకు గోపన్‌పల్లి రహదారిని విస్తరించేందుకు నిర్ణయించింది. ఈమేరకు అటు గోపన్‌పల్లి నుంచి విప్రో చౌరస్తా వరకు రహదారి విస్తరణ చేపట్టగా, ఇటు నల్లగండ్ల నుంచి వట్టినాగులపల్లి ఔటర్ రింగురోడ్డు వరకు రేడియల్ రింగురోడ్డు నిర్మాణం చేపట్టింది. కాగా విస్తరించిన రహదారులతో ట్రాఫిక్ రద్దీ పెరుగగా, గోపన్‌పల్లి తాండా చౌరస్తా వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. లింగంపల్లి మీదుగా ఐటి కారిడార్‌కు ప్రయాణించే వాహనాలతో పాటు తెల్లాపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలతో గోపన్‌పల్లి చౌరస్తా నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులకు గురయ్యింది. గోపన్‌పల్లి చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ నిర్మాణానికి పూనుకుంది.

**400మీటర్ల పొడవు... నాలుగేళ్లుగా నిర్మాణం...**

ఐటి కారిడార్ నుంచి గోపన్‌పల్లి వైపు, అటు గోపన్‌పల్లి తాండా మీదుగా తెల్లాపూర్ వైపు వై ఆకారంలో వన్‌వేలో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం గత నాలుగేళ్ల క్రితం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



అసంపూర్తిగా నిర్మాణ పనులు

మొత్తం 30కోట్ల రూపాయల అంచనా వ్యయంతో, 12 మీటర్ల వెడల్పు, 400మీటర్ల పొడవుతో ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి పునాది పడింది. ఎస్ఆర్‌డిపి ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఈ ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభంలో సజావుగానే సాగింది. అనంతరం నిర్మాణ సంస్థ చాలా రోజుల పాటు నిర్మాణ పనులను మద్యలో నిలిపివేసింది. పిల్లర్ల వరకు జరిగిన నిర్మాణంతో నిర్మాణం ముందుకు సాగకుండా వదిలివేయడంతో స్థానికులు నిత్యం నరకం చూశారు. చివరకు ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయాలంటు స్థానికులు ఆందోళనలకు సైతం దిగడంతో దిగివచ్చిన ప్రభుత్వం తిరిగి నిర్మాణ పనులను ప్రారంభించింది. కాగా నిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థ నత్తనడకన చేపడుతుండడంతో గడువు ముగిసినా పనులు పూర్తి కాలేదు. శంకుస్థాపన సమయంలో ఏడాదిలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్న ఫ్లైఓవర్ మూడేళ్లు గడుస్తున్నా పూర్తి కాకపోగా, ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాండా చౌరస్తా వద్ద ఓ వైపు రహదారిని మూసివేయడం, ఫ్లైఓవర్ కింద చౌరస్తా వద్ద వాహనాల గజిబిజి పరుగులతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

**ఆర్‌టిఐలతో నిలదీస్తున్న ప్రజలు..**

గోపన్‌పల్లి చుట్టు ప్రక్కల భారీ ఎత్తున బహుళ అంతస్థుల నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీలు పుట్టుకురావడంతో తాండా చౌరస్తా వద్ద తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. మరోవైపు ఫ్లైఓవర్ నిర్మాణం ఏళ్లుగా సాగుతుండడంతో స్థానికులు రైట్ టు ఇన్ఫర్మేషన్(ఆర్‌టిఐ) యాక్ట్‌తో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు ఆర్‌టిఐ ద్వారా గోపన్‌పల్లి ఫ్లైఓవర్ పూర్తి చేయడంపై ప్రశ్నించగా, అధికారులు ఇప్పటి వరకు నాలుగుసార్లు తేదీలను ప్రకటించింది. చివరిసారిగా అక్టోబరు నాటికి పనులను మొత్తం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పిన అధికారుల ప్రకటన బుట్టదాఖలైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోపన్‌పల్లి ఫ్లైఓవర్‌ను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## మెరిసిన అమయ అగర్వాల్, అనయ్ అగర్వాల్

**వరల్డ్ అండర్ - 8చెస్ ఛాంపియన్‌లుగా నిలిచిన ట్విన్స్**



గెలుపొందిన ట్రోఫీలతో ట్విన్స్ అమయ, అనయ్

హైదరాబాద్, నవంబర్ 22,ప్రభాతవార్త: నగరానికి చెందదిన సూపర్ ట్విన్స్ అమయ అగర్వాల్, అనయ్ అగర్వాల్ వరల్డ్ అండర్ -8 చెస్ ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటారు. అండర్ -8 కేటగిరీలో అమయ బెస్ట్ గర్ల్స్ ఛాంపియన్‌గా ,అనయ్ బాయ్స్ ఛాంపియన్‌గా నిలిచారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోచ్‌లు చైతన్య, స్రవంతిలు మాట్లాడుతూ ఇటీవల ఈజిప్ట్, సెర్బియాలో జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో తమ రేటింగ్‌ని పెంచుకుని వరల్డ్ ఛాంపియన్లుగా నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒకసంవత్సరంలోనే ఇలాంటి విజయాలను నమోదు చేయడం అరుదైన విషయమని వీరిద్దరూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కోచ్ సందీప్‌నాయుడు, తనాషా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుంది : మంత్రి

సంజీవరెడ్డి నగర్, నవంబర్ 22, ప్రభాతవార్త : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం అమీర్‌పేట డివిజన్‌లోని బల్కంపేట, వెంకటేశ్వర స్వామి టెంపుల్, ఈడబ్ల్యూఎస్, ముస్లిం బస్తీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ప్రజలు బ్రహరథం పట్టారు.

## నివాసయోగ్యమైన నగరాల్లో హైదరాబాద్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘతన బిఆర్ఎస్ ప్రభుత్వానిది

**శేరిలింగంపల్లి బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ**



మియాపూర్ డివిజన్‌లో రోడ్‌షో నిర్వహించి ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 22 ప్రభాతవార్త : దేశంలోని మోస్ట్ లివబుల్ సిటీగా నగరం వరుసగా అవార్డులు సొంతం చేసుకుంటుందని, హైదరాబాద్‌ను నివాసయోగ్యమైన నగరాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదని శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ అన్నారు. నేడు దేశంతో పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన వారు నగరంలో స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మియాపూర్ డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి అరెకపూడి గాంధీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన కాలనీలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి అరెకపూడి గాంధీ సతీమణి శ్యామలాదేవి ప్రచారం నిర్వహించారు. శేరిలింగంపల్లి డివిన్ పరిధిలోని బొటానికల్ గార్డెన్‌లో అరెకపూడి గాంధీ కుమారుడు ప ృధ్వీ గాంధీ, కోడలు భార్గవిలు వాకర్లతో సమావేశమై రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అరెకపూడి గాంధీని గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గాంధీ మాట్లాడుతూ నేడు బిఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో శాంతిభద్రతలను పటిష్టంగా అమలు చేస్తుందని, తద్వారా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థలు ఎన్నో తమ కార్యాలయాలను నగరంలో ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ప్రఖ్యాత సంస్థలతో పాటు ఎన్నికల కమీషన్ కార్యాలయం, యుఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం శేరిలింగంపల్లిలో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం అత్యధిక జనాభాతో రికార్డు స ృష్టిస్తుందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భారీ ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పెరుగుతున్న బిజెపి గ్రాఫ్

**విద్యావంతుడు, యువకుడైన తోకలకు అనుకూలంగా మారిన యువత**

నార్సింగి, నవంబర్ 22 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బిజెపి గ్రాఫ్ వేగంగా పెరుగుతుంది. పిల్ల కాలువలా ప్రారంభమైన బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం రోజు రోజుకు ఉధృతమై, ఉప్పెనలా మారింది. ఎక్కడ ప్రచారం చేసినా, రోడ్‌షోలు చేసినా జన నీరాజనం కనిపిస్తుంది. ఏ హోటల్‌లో, ప్రధాన కూడళ్లలో చూసినా జనం విద్యావంతుడు, యువకుడైన తోకల శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకుందామని చర్చించుకోవడం కనిపిస్తుంది. ముఖ్యంగా 18.-35.ఏళ్ల మధ్యనున్న యువత పెద్ద సంఖ్యలో బిజెపికి మద్దతు పలుకుతున్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు మైనార్టీల జపం చేస్తూ... మెజారిటీలైన హిందువుల గురించి పట్టించుకోకపోవడంతో వారంతా బిజెపి వైపుకు మళ్లుతున్నారు. మేము గెలిస్తే ముస్లింల ఉన్నత చదువులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామని, ప్రత్యేక కళాశాలలు నిర్మిస్తామని, ప్రత్యేక ఆసుపత్రులు నిర్మిస్తామని పదేపదే ప్రచారం చేయడంతో విసిగిపోయిన హిందువులు కాంగ్రెస్, బిజెపిలకు క్రమంగా దూరమవుతున్నారు. దేశం, ధర్మం కోసం పని చేసే ఏకైక పార్టీ బిజెపి అని, భవిష్యత్తులో మన మనుగడ సాగాలంటే హిందువులమంతా మూకుమ్మడిగా బిజెపికే అండగా ఉండాలన్న కసి రోజు రోజు పెరుగుతుంది. ఐటీ ఉద్యోగులు, సెటిలర్లు, ఉత్తర భారత ఓటర్లు, యువత ఈ దఫా బిజెపికి పూర్తి మద్దతుగా నిలబడుతున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి తోకల చేస్తున్న ప్రచారానికి కూడా ప్రజలు పెద్ద ఎత్తున ఆకర్షితులవుతున్నారు. హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభ అనంతరం దళితులంతా బిజెపికి అండగా నిలబడ్డారు. బిజెపి గెలుపు కోసం ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. బుధవారం రాజేంద్రనగర్ బిజెపి అభ్యర్థిని కలిసి నీ గెలుపు కోసం రేయింబవళ్లు కష్ట పడుతామని సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాలను జవదాటబోమని, ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ఒక్క ఓటు కూడా వేసేది లేదని ఎమ్మార్పీఎస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా మాదిగలను మభ్యపెట్టి, మా ఓట్లను దండుకొని రాజ్యాధికారం చెలాయించిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ఓటుతో గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకటిస్తున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 75.వేల మాదిగల ఓటర్లు ఉన్నారు. వీరిలో 90.శాతం ఓట్లను బిజెపికి వేయించి తీరుతామని శపతం చేస్తున్నారు. మైలార్‌దేవుపల్లిలో 70.వేల ఓట్లు, ఉత్తర భారతానికి చెందిన 60.వేల ఓట్లు, దళితులకు చెందిన 75.వేల ఓట్లు, 30.వేల బిజెపి సాంప్రదాయక ఓట్లు అన్నీ సాధించి తొలిసారిగా రాజేంద్రనగర్‌లో "కాషాయం" జెండాను ఎగురవేసి తీరుతామని బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం పార్టీలు మూడు ఒక్కటేనని, ముగ్గురు కలిసి బిజెపిని ఓడించేందుకు కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే వదిలిన బాణమని, డమ్మీ అభ్యర్థి అని పదే పదే తోకల చేస్తున్న ప్రచారంకు సైతం ప్రజలు పెద్ద ఎత్తున ఆకర్షితులవుతున్నారు. ఇప్పటి వరకు సాగుతున్న ప్రచారం, రోడ్‌షోలకు జనాల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే రాజేంద్రనగర్‌లో బిజెపి గెలుపు ఖాయమన్న సంకేతాలే అధికంగా కనిపిస్తున్నాయి.



విద్యార్థినీలను అరెస్టు చేస్తున్న పోలీసులు

## రోడ్డు మీద బైఠాయించిన నిజాం కళాశాల గర్ల్స్ హాస్టల్స్ విద్యార్థినీలు

సైఫాబాద్, నవంబరు 22 ప్రభాతవార్త: నిజాం కళాశాల విద్యార్థినీల హాస్టల్స్‌లో కనీస సౌకర్యాలు, మంచినీటి సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది బుధవారం బషీర్‌బాగ్‌లో రోడ్డుమీద బైఠాయించి నిరసన ప్రదర్శన చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఎంత సర్దిచెప్పినప్పటికి విద్యార్థులు ఆందోళనను కొనసా గించారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు మాట్లాడుతూ గత నెల రోజులుగా హాస్టల్‌లో మంచినీటి సమస్యతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మంచినీటి సమస్య, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలని పలు మార్లు ప్రిన్సిపల్‌కు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. ఒక లక్ష రూపాయల ఖర్చుతో మోటారు బాగుచేయించామని అధికారులు చెప్పారని, కాని నీటి సమస్య పరిష్కారం కాలేదని విచారం వ్యక్తం చేశారు.

## యాదగిరిగుట్ట దేవాలయం పునర్‌నిర్మాణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి




సమావేశంలో మాట్లాడుతున్న హారక్ బహదూర్ ఛత్రి

సైఫాబాద్, నవంబరు 22 ప్రభాత వార్త: పవిత్రమైన పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునర్‌నిర్మాణం మొత్తం ప్రక్రియపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపించాలని హిందూ ఏక్తా ఆందోళన్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు హారక్ బహుదూర్ ఛత్రి మాట్లా డుతూ శ్రీలక్ష్మీనరసింహస్వామి పురాతన విగ్రహం ప్రస్తుతం దేవాలయంలో లేదని, విగ్రహం ఏమైందని, ఎక్కడ ఉందని ప్రశ్నించారు. 4 వేల సంవత్సరాల క్రిందట యాదగిరిగుట్టపై భూమికి 3 అడుగుల లోతులో స్వయంభూగా వెలసిన గర్భగుడిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి విగ్రహానికి స్థానభ్రంశం కలించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని, దేవాలయాన్ని 12 అడుగుల లోతులోకు తవ్వకాలు జరపాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తవ్వకాల్లో దొరికన వస్తువులను పురావస్తు శాఖకు ఇప్పటివరకు ఎందుకు బహిర్గతం చేయలేదని ఆయన నీలదీశారు. తవ్వకాల్లో అత్యంత పురాతన నిధి నిక్షేపాల భాండాగారం దొరికిందని, వాటిని అన్యాక్రంతం చేశారని పలు అనుమాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. స్వామి పురాతన విగ్రహం మాయంపై ఈ మేరకు అఖిల భారతీయ హిందూ మహాసభ అధ్యక్షుడు రవిరంజన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు ఎఫ్ఐఆర్ చేయలేదని ఆరోపించారు. విగ్రహం అదృశ్యంపై ఒక నిజ నిర్ధారణ కమిటిని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కమిటి దేవాలయాన్ని సందర్శించి త్వరలోనే నివేదికను అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో కృష్ణంరాజు, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్ బిజిలి, కె.మహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బన్సీలాల్‌పేట్‌లో మంత్రి తలసాని ఇంటింటి ప్రచారం



బన్సీలాల్‌పేట్‌లో ఎన్నికల ప్రచారం జరుపుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, నవంబర్ 22 ప్రభాతవార్తః సమర్థవంతమైన నాయకత్వం ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందని, అభివృద్ధి కార్యాక్రమాలు జరుగుతాయని బీఆర్ఎస్ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుదవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ జయప్రకాష్‌నగర్, కీస్‌బ్లాక్, గుండమ్మ గుడి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం జరిపారు. ప్రచారంలో మంత్రికి అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. ఇంటింటా మంగళహారతులు పట్టి, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు అన్ని సందర్భాలతో అండగా ఉండే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కె తమ సంపూర్ణ మద్దతు అంటూ వాగ్దానాలు చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలు మన ముఖ్యమంత్రి కేసీఆర్ పనితీరుకు నిదర్శనమన్నారు. దేశానికే తెలంగాణ దిక్సూచిగా నిలిచిందని తెలిపారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కల్లబొల్లి మాటలు, ఆచరణ సాధ్యంకాని హామీలతో వచ్చే కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

## ఏషియన్ ఫిన్ స్విమ్మింగ్ పోటీలకు నగర స్విమ్మర్ ఎంపిక



హైదరాబాద్, నవంబర్ 22,ప్రభాతవార్త: థాయిలాండ్ దేశంలోని పుకెట్‌నగరంలో ఈనెల 24నుంచి 28వరకు జరగనున్న 6వ ఏషియన్ చెస్‌ఛాంపియన్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి హైదరాబాద్ బర్కత్‌పురా ప్రాంతానికి చెందిన స్టీఫెన్ కుమార్ (19) ఎంపికయ్యారు. ఫిన్ స్విమ్మింగ్ పోటీలల్లో 50మీటర్లు, 100మీటర్లు, 400మీటర్లు, మోనోఫిన్, బైపిన్ పోటీలల్లో స్టీఫెన్ కుమార్ పాల్గొననున్నారు. ఇంటర్‌పూర్తి చేసిన ఈవిద్యార్థి ప్రముఖ అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా కుమారుడు కావడం గమనార్హం. అదేవిధంగా వారి ఇరువురికి స్విమ్మింగ్ కోచ్ దినేష్ రజోరియా కావడం విశేషం. ఈసందర్భంగా స్టీఫెన్ కుమార్ మాట్లాడుతూ అసియా ఖండంలోని వివిధ దేశాలు పాల్గొంటున్న ఈపోటీల్లో తాను ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈపోటీల్లో మెడల్ సాధించి భారత కీర్తి ప్రతిష్టలను నలుదిశల చాటి చెబుతున్నానన్నారు.

# మాదిగలమంతా మూకుమ్మడిగా బిజెపికి ఓట్లు వేస్తాం : ఎమ్మార్పీఎస్

## రాజేంద్రనగర్‌లో శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం



మైలార్‌దేవుపల్లిలో ఎమ్మార్పీఎస్, బిజెపి సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

నార్సింగి, నవంబర్ 22 ప్రభాతవార్త : ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని మాదిగలమంతా మూకుమ్మడిగా బిజెపికే ఓట్లు వేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వనం నర్సిహ్మా పేర్కొన్నారు. బుధవారం మైలార్‌దేవుపల్లిలోని బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఇంటికెళ్లి ఎమ్మార్పీఎస్ తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు వనం నర్సిహ్మా, మద్దిలేటిలు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మాదిగల రిజర్వేషన్లు చేయాలని ఉద్యమాలు చేసినా, ఆందోళనలు, ధర్నాలు చేసినా టిడిపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు పట్టించుకోలేదని, నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అప్పటి ప్రధాని వాజ్‌పాయి మాదిగల రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ తీసుకు వచ్చారని, ఇప్పుడు ప్రధాని నరేంద్రమోడీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టేందుకు కసరత్తు చేస్తున్నారన్నారు. మొదటి నుంచి బిజెపియే వర్గీకరణకు అనుకూలంగా ఉందని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం మాదిగల మంతా మా బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతామని స్పష్టం చేశారు. చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ అంతా మమ్ములను మోసం చేసిన వారేనని తెలిపారు. అనంతరం తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మాదిగల రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్‌లో పెట్టేందుకు ప్రధాని మోడీ కసరత్తు ప్రారంభించారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నేత మోడీ అని పేర్కొన్నారు. మాదిగల విశ్వరూప మహాసభ తరువాత మాదిగలంతా బిజెపికి అండగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు అంజన్ కుమార్‌గౌడ్, శ్రీధర్, మహలింగంగౌడ్, టి.శ్రీశైలంరెడ్డి, డి.లక్ష్మీనారాయణ, ఇందిరా, ఎమ్మార్పీఎస్ నేతలు సురేష్, శంకర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

**శంషాబాద్‌లో భారీ రోడ్‌షో :** శంషాబాద్ మండలంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డికి నిర్వహించిన భారీ రోడ్‌షోకు జనం బ్రహ్మరథం పట్టారు. మహిళలు మంగళహారతులిచ్చి ఆహ్వానం పలికారు. రోడ్‌షో తరువాత శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 15.సంవత్సరాలలో అసెంబ్లీలో కనీసం 15.నిమిషాల సమయం కూడా మాట్లాడలేని దద్దమ్మ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటే సమాధానం చెప్పే ధైర్యం లేక పారిపోతున్నాడన్నారు. బిజెపికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి భయపడిపోయిన బిఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలు ఒక్కటయ్యాయన్నారు. ప్రజలంతా కలిసి కమలంకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో నన్ను గెలిపించాలని తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

# ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటా.. అవకాశం కల్పించండి

## శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

### కలిసికట్టుగా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 22 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి ప్రజలకు ఏళ్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. విద్యావంతుడినైన తనకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హాఫీజ్‌పేట్‌లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జగదీశ్వర్‌గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగద్గిరిగుట్టలోని మాధవనగర్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ సొంతమని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పి.జనార్ధన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల హయాంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో తీసుకువచ్చిన డయల్ 100 ఎన్నో వేల మంది ప్రాణాలను కాపాడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పార్టీ ప్రకటించిన 6సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవంతో అవినీతి లేని పాలనను అందిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాల్లో భాగంగా ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సొంత జాగా ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం 5లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మి పథకాన్ని ప్రకటించిందని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ప్రతినెల 2500 రూపాయల నగదు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను అమలు చేస్తామని అన్నారు.

# రాజేంద్రనగర్‌లో ఓట్లు అడిగే హక్కు నాకే ఉంది

## బిఆరెస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్.. బిఆర్‌ఎస్‌లో చేరిన బిజెపి కార్పోరేటర్



బండ్లగూడలో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న రాజేంద్రనగర్ బిఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 22 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంను వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేశానని, ఇక్కడ ఓట్లు అడిగే హక్కు నాకే ఉందని ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ అభ్యర్థి టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో చేసిన భారీ రోడ్‌షోకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. బిజెపి కార్పోరేటర్ భూపాల్‌గౌడ్ ఎట్టకేలకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి ఆయనను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ గత 15.ఏళ్లుగా రాజేంద్రనగర్‌లో నేను చేసిన అభివృద్ధి, బిఆర్‌ఎస్ సర్కారు సమర్థవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పతకాలకు ఇతర పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బిఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కుగ్రామాల సమూహంగా ఉన్న రాజేంద్రనగర్‌ను హైటెక్‌సిటీకి ధీటుగా అభివృద్ధి చేశానని, ప్రణాళిక బద్దంగా పని చేయడం వల్లనే ఇది సాధ్యపడిందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇందుకు అందించిన తోడ్పాటు ఎనలేనిదన్నారు. దేశంలోనే ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న ఏకైక సర్కారు తెలంగాణ సర్కారు అని తెలిపారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల పాలిత రాష్ట్రాలలో కరెంటు సవ్యంగా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మన తెలంగాణలో 24.గంటల నాణ్యమైన కరెంటును ఉచితంగా రైతులకు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాందాస్, అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పోరేటర్లు చంద్రశేఖర్, పద్మా పాండు, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతి పాపయ్య యాదవ్, మాలతీ నాగరాజు, శ్రీలతగౌడ్, లతా ప్రేమ్‌గౌడ్, నిఖిల సంగారెడ్డి పాల్గొన్నారు.

# వ్యక్తుల ఆధారంగా ఈ ఎన్నికల్లో మద్దతు

## జమాఅతె ఇస్లామీ హింద్




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జమాఅతె ఇస్లామీ హింద్-అలయన్స్ ఫర్ డెమొక్రసీ ప్రతినిధులు

హైదరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త: రాజకీయాల్లో ప్రమాణాలు ,విలువలు కోరుకునే జమాఅతే ఇస్లామీ హింద్ ఈఎన్నికల్లో పార్టీలకు కాకుండా వ్యక్తుల ఆధారంగా మద్దతు తెలుపుతుందని వైస్ ప్రెసిడెంట్ ఎ.ఎస్ సోహెబ్ తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ విభాగం -అలయన్స్ ఫర్ డెమొక్రసీతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈఎన్నికల్లో ఎవరికి మద్దతివ్వాలనే దానిపై విస్తృతమైన సంప్రదింపులు జరిపామని జమాఅత్ స్థానిక యూనిట్లు, జమాఅత్ సభ్యుల కార్యకర్తల అభిప్రాయాన్నిదృష్టిలో ఉంచుకుని ఓనిర్ణయానికి వచ్చామన్నారు. ఈఎన్నికల్లో పార్టీ అధారంగా కాకుండా వ్యక్తుల ఆధారంగా సమాజ హితానికి పాటుపడేవారికి మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉదాహరణకు సిర్పూరునుంచి పోటీ చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కు మద్దతిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలందరూ తమ ఓటుహక్కును ఉపయోగించుకోవాలని, పోలింగ్ రోజున సాధ్యమైనంత త్వరలో పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఇంటర్నేషన్ ఐకాన్ అవార్డు



తన తోటి సిబ్బందితో కలసి ఆవార్డును చూపిస్తున్న ఎస్.ఎస్ రాజు

తార్నాక, నవంబర్ 22 ప్రభాతవార్త: తార్నాకకు చెందిన ప్రముఖ ప్రముఖ రియల్‌స్టేట్ సంస్థ రాజా ఇన్‌ఫ్రాడెవలపర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్.రాజు ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆయన బుధవారం తార్నాకలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆవార్డు పొందిన వివరాలను సీఎండీ రాజు వెల్లడించారు. గత శతాబ్దకాలంగా వివిధ సామాజిక సేవలతో పాటు రియల్‌స్టేట్ రంగంలో తమ సంస్థ అందిస్తున్న సేవలను గుర్తించిన దుబాయి ప్రభుత్వం రాజాఇన్‌ఫ్రా డెవలపర్స్ సేవలను గుర్తించి ఈ ఆవార్డును అందజేసినట్లు రాజు చెప్పారు. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన సంస్థగా తమను ఒకటిగా గుర్తించడం సంతోషంగా ఉందని ఆవార్డు గ్రహిత సిఎండీ రాజు పేర్కోన్నారు. ఈ ఆవార్డు అందుకోవడం పట్ల భాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇంతకాలం ప్రోత్సహించి సహకరించిన వినియోగదారులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. కష్టపడి పనిచేయడంతో పాటు నిజాయితీ, నిబద్ధతతో చేస్తే ఏదైనా సాధ్యమౌతుందని రాజు పేర్కోన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

# స్థానికంగా ఉన్న వాళ్లు తెలంగాణ బిడ్డలే..

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రచారంలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, నవంబర్ 22, ప్రభాతవార్త :: కూకట్‌పల్లి నియోజకవర్గంలో అన్నదమ్ముల వలె ప్రశాంత జీవనం గడుపుతున్నామని స్థానికంగా ఉన్న వివిధ ప్రాంతాల వాళ్ళు తెలంగాణ బిడ్డలేనని ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్ తూము శ్రావన్ కుమార్‌తో కలిసి మూసాపేట్‌లో బుధవారం ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. మూసాపేట్ ఇందిరాగాంధీ విగ్రహం నుండి మొదలైన ర్యాలీ జనతా నగర్, యాదవ బస్తీ, గూడ్‌షెడ్ రోడ్, భరత్‌నగర్, అవంతి నగర్ తోట, బబ్బుగూడ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ పదేళ్ళ కాలంలో హైదరాబాద్ మహానగరాన్ని శాంతిభద్రతలకు మారుపేరుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌దేనని అన్నారు. గత పాలనలో ఎక్కడ ఏ విధ్వంసకర చర్య జరుగుతుందో అర్ధంకాని పరిస్థితి నుంచి నేడు పటిష్ట శాంతిభద్రతలకు ఎక్కడా విఘాతం కలగకుండా కులాలు, మతాలు మధ్య విద్వేషాలు రేగకుండా అందరం సమానం అనే భావన హైదరాబాద్ మహానగరంలో ఏర్పరిచారని అన్నారు. ప్రజలకు కావలసిన మంచినీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు ఎక్కడ ఇబ్బంది లేకుండా నిరంతరం ప్రజాప్రతినిధులు అధికారులు అందుబాటులో ఉండి ఏ లోటు లేకుండా చూసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం శీలం పరితపించేవారు

బేగంపేట్, నవంబర్ 22 ప్రభాతవార్త : మాజీ కార్పొరేటర్, టీపీసీసీ కార్యదర్శి స్వర్గీయ శీలం ప్రభాకర్‌కు పలువురు పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. శీలం ప్రభాకర్ సంస్మరణ సభ బుధవారం ఎంజీ రోడ్డులోని మున్నూరుకాపు సంఘం హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, సనత్‌నగర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మర్రి శశిధర్‌రెడ్డి, కోట నీలిమలతో పాటు అధికారులు, స్నేహితులు వచ్చి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకుడిగా ఆయన ప్రజలకు అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఏ పదవి లేకున్నా నిత్యం ప్రజల్లో ఉండే వారి సమస్యల పరిష్కారం కోసం శీలం ప్రభాకర్ నిరంతరం పరితపించే వారని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం ప్రజలందరికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నాయకులు శ్రీపతి సతీష్ కుమార్, ఎం.రాజు, పిల్లి శ్రీనివాస్‌రావు, చీర శ్రీకాంత్, సతీష్, చామకూర సుజాత, ఆదం సంతోష్, ఆదం విజయ్‌కుమార్, కరాటేరాజు, ఎంఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బిఆర్‌ఎస్‌కు వేసినట్లే..

## బిఆర్‌ఎస్ కాంగ్రెస్‌లకు బిజెపియే ప్రత్యామ్నాయం : బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్



ప్రచారంలో పాల్గొన్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, నవంబర్ 22, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ 131 డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్, ఇంద్రసింగ్‌నగర్, వాణినగర్, మహేందర్ నగర్, కాకతీయ నగర్, అంబేద్కర్‌నగర్, చెరుకుపల్లి కాలనీలలో బుధవారం కుత్బుల్లాపూర్ బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనని గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ డివిజన్‌లో బిజెపి ప్రచారానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, కాంగ్రెస్‌కి ఓటు వేస్తే ఎన్నికలు అయ్యాక కెసిఆర్ పార్టీలో చేరుతారని అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ పని ఖతమైందని, ప్రజలంతా బిజెపి వైపే ఉన్నారని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఆయన తన హామీలను వివరించారు. బస్తీలలో మౌలిక సౌకర్యాలతో పాటు, పేదలకు ఇండ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారులందరినీ గౌరవించుకుంటామని వారికి ఇండ్లు పెన్షన్లు ఇప్పిస్తామన్నారు. కార్మికుల సంక్షేమం కొరకు ప్రత్యేక సంక్షేమ బోర్డును కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేస్తానని, జీడిమెట్ల ఈఎస్ఐ ఆసుపత్రిని ఆధునీకరించి, ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రికి ధీటుగా అందిరికీ అందుబాటులోకి తెస్తానని అన్నారు. అన్ని కుల సంఘాలకు సంక్షేమ భవనాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్‌షో నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి



ప్రచారంలో భాగంగా రోడ్‌షోలో పాల్గొన్న హన్మంత్‌రెడ్డి

జీడిమెట్ల, నవంబర్ 22, ప్రభాతవార్త : ఎన్నికల ప్రచారంలో భాగంగా 131 కుత్బుల్లాపూర్ డివిజన్‌లో బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కెపి విశాల్‌గౌడ్‌లు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతమున్న దుష్ట పరిపాలన ప్రభుత్వాన్ని తరిమికొట్టాలన్నారు. సుస్థిర పాలనను అందించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. విశాల్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను గడపగడపకు ప్రాచరం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి హన్మంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం హన్మంత్‌రెడ్డి, విశాల్‌గౌడ్‌లు కల్పన సొసైటీ, బాపూనగర్, గనేష్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్, జాకీర్, జెస్సీపాల్, చింతల నాగరాజ్, రాధాకృష్ణ, సిద్ధయ్య, బంటునరేస్, రాజు, వెంకటేశ్వరరావు, సుజాత, శోభరాణిలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం

**కొంపల్లి..** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్స్‌లో బుధవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 28న రాష్ట్రానికి విచ్చేస్తున్న రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ రోడ్‌షో కార్యక్రమం ఏర్పాట్లు, రోడ్‌షోను జయప్రదం చేయడం తదితర అంశాలపై నియోజకవర్గ నాయకులు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నర్సారెడ్డి భూపతిరెడ్డి, జ్యోష్ణ శివారెడ్డి, బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, ప్రేమ్, శ్రవణ్‌కుమార్, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు సిఎం పదవి కాదు, చట్ట సభలలో రిజర్వేషన్‌లు కావాలి

సైఫాబాద్, నవంబరు 22 ప్రభాతవార్త: పదేళ్ళపాటు ఓబిసి సామాజిక వర్గానికి చెందిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బిసిలకు ఏమిచేయలేకపోయారని, తెలంగాణ రాష్ట్రానికి బిసి ముఖ్యమంత్రిగా వచ్చినా కూడా ఏమిచేయలేరని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఆరోపించింది. బిసిలకు కావాల్సింది సిఎం పదవి కాదని, బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు, మహిళా బిల్లులో ఓబిసి మహిళలకు రిజర్వేషన్‌లు, ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ అని సంఘం డిమాండ్ చేసింది. బుధవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, నాయకులు ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, బత్తుల సిద్దేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ నేత మంద కృష్ణమాదిగ మాటలకు బిసిలు కరిగిపోయి బిజెపికి ఓట్లు వేయరని, స్వయాన శ్రీకృష్ణభగవానుడు వచ్చి చెప్పినా వేయరని స్పష్టం చేశారు.

# కుత్బుల్లాపూర్ గడ్డపై గులాబీ జండా ఎగరాలి : ఎమ్మెల్యే కెపి వివేకానంద




తాండ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

జీడిమెట్ల, నవంబర్ 22, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ గడ్డపై గులాబీ జండా ఎగరాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. బుధవారం దుందిగల్ మున్సిపాలిటీ పరిధి 27వ వార్డులోని దుందిగల్ తాండ 1, తాండ 2, వార్డు నెంబర్ 1, 28లలోని చర్చి గాగిల్లాపూర్ సర్వే. నెంబర్ 214, చైతన్య కాలనీ, ఓల్డ్ గాగిల్లాపూర్ 2,3,4,5 వార్డు, దుండిగల్, నాగులూర్‌లలో ఎమ్మెల్యే కెపి వివేకానంద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతం ద్వారా వేగంగా అభివృద్ధి సాధించవచ్చునని నమ్మి తాండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులతో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి చేసిన ప్రజా నాయకుడు సీఎం కెసిఆర్ అని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నాడు చిన్న చిన్న గ్రామాలుగా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే బిఆర్‌ఎస్ పార్టీని నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, వార్డు అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు హామీలకు, ప్రచారాలకు మోసపోవద్దు

## కర్నాటక రైతు సంఘం అధ్యక్షులు కె చంద్రశేఖర్



ధర్నాలో అభివాదం చేస్తున్న కర్నాటక రైతు సంఘం మరియు గ్రీన్ ఆర్మీ నేతలు

ధర్నాచౌక్, నవంబర్ 22, ప్రభాతవార్త: ఎన్నికలలో నాయకులు ఇచ్చే తప్పుడు హామీలను, ప్రచారాలను నమ్మి మోసపోవద్దని కర్నాటక రైతు సంఘం అధ్యక్షులు కే.చంద్రశేఖర్ హితవుపలికారు. బుధవారం కర్నాటక రైతు సంఘం మరియు గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో రైతుల ఓటును కాపాడుకుంటామంటూ ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అమచేసిన వ్యవసాయ చట్టాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వటంతో కర్నాటక ఎన్నికలలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించామని గుర్తు చేశారు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ వ్యవసాయ చట్టాన్ని మాత్రం రద్దు చేయకపోగా అవే చట్టాలను పూర్తి స్థాయిలో అమలుచేసేందుకు కృషి చేస్తున్నారని ఆరోపించారు. రైతులు భూములను పెద్ద ఎత్తున అమ్ముకుంటూ ప్రాణాలు సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు వ్యవసాయ పంప్‌సెట్స్ కోసం ట్రాన్స్‌ఫారం, స్తంభం, వైరు వంటి పనిముట్లను ఇకపై ఇవ్వమని, మార్కెట్‌లోనే కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని ఆరోపించారు. పాడి పరిశ్రమలో సైతం కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని, ఎన్నికలలో లీటరు పాలకు 7 ఇస్తామని చెప్పి బెంగుళూరు డెయిరీ ఒక్కసారిగా రెండు రూపాయలు పాలధర, రెండు రూపాయలు పశుగ్రాసం ధర ఎక్కువ చేసి పాడి రైతుల నుండి నాలుగు రూపాయలు దోచుకుంటోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చైరె గౌడ్, నాయకులు నారాయణస్వామి, ఆరాధ్య, ఉమ, బైరెగౌడ్ పాల్గొన్నారు.

# లష్కర్‌లో బిఆర్‌ఎస్‌ను గెలిపించాలి : లింగాని ప్రసన్న



తుకారాంగేట్‌లో పద్మారావును గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

అడ్డగుట్ట, నవంబర్ 22 ప్రభాతవార్త: సికింద్రాబాద్ బిఆర్‌ఎస్ అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌ను బారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం తుకారాంగేట్, గోల్‌బావి, కొండా రెడ్డి నగర్, గడ్డమీది బస్తీ, ఎంసి.హెచ్.క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఅర్‌ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్‌తో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్‌ఎస్ నాయకులు నక్క మధు, శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్, పెండెంమనోహార్, మహ్మద్, పొన్నాల రాజు, వసంత, అమర్, వెంకటేశ్, మహేశ్వరీ, మోహన్, శివశంకర్, సంతోష్ పాల్గొన్నారు.

# ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపకాలను అరికట్టాలి

## గవర్నర్‌కు విజ్ఞప్తి చేసిన జర్నలిస్టుల బృందం



గవర్నర్ తమిళిసైకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ప్రతినిధి బృందం

సైఫాబాద్, నవంబరు 22 ప్రభాతవార్త:రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు డబ్బు, మద్యం పంపకాలతో ఓటర్లను ప్రలోభాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ప్రతినిధులు రాష్ట్ర గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను ఒక ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. గవర్నర్‌ను కలిసిన బృందంలో వేదిక సభ్యులు పాశం యాదగిరి, మామిడి సోమయ్య, అఖిల భారత జర్నలిస్టుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు అనంచిన్ని వెంకటేశ్వర్‌రావు, నామాల విశ్వేశ్వరరావు, హరినాథ్, రవికుమార్, సి.హెచ్.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, ఎన్నికల సందర్భంగా పాత్రికేయులపై జరుగుతున్న దాడులు, ఇతర నిఘా విషయాలపై వారు గవర్నర్ దృష్టికి తీసుకువెళ్ళారు.

# వేల కోట్లతో అభివృద్ధి చేసి ఎల్‌బినగర్ నియోజక వర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు


మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పొన్నాల, దేవిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 22 (ప్రభాతవార్త):** బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి నివాసంలో నిర్వహించిన డివిజన్ పరిధిలోని పలు కాలనీ, అధ్యక్ష కార్యదర్శ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విచ్చేసారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సుధీర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ మాకు 118 జీ.ఓ. తీసుకొచ్చి మా జీవితాల్లో వెలుగులు నింపారని, మేము జీవితాంతం వారికి రుణపడి ఉంటామని తెలిపారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో వేలాది కోట్లతో ఎల్.బి.నగర్ లో అభివృద్ధి చేసి, దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. ఎల్.బి. నగర్ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం వేలాది కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఎన్నో నిరుపేద కుటుంబాల్లో జరిగిన వివాహాలకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను యథావిధిగా కొనసాగించే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే 118 జీ.ఓ. ఒక ఘన విజయం అని తెలిపారు. 118 జీ.ఓ.వల్ల దాదాపు 38 కాలనీవాసుల సమస్య పరిష్కారమైందని, అదే విధంగా రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కారం చేస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ కోసం అధికార పార్టీలో చేరి వెళ్లడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలనుంచి ఎన్నో ఆరోపణలు, విమర్శలు వచ్చిన పట్టించుకోకుండా మూడేళ్ల కష్టపడిన ప్రయత్నం కొలిక్కి రాకపోవడంతో రాజీనామాకు సిద్ధపడ్డానని, ఆ సమయంలో బాధిత కాలనీ ప్రతినిధులు వచ్చి నాకు అండగా నిలిచి, నా వెంట ఉంటామని భరోసా ఇవ్వడంతో కసరత్తు చేసి చివరకు విజయం సాధించామని పేర్కొన్నారు. అప్పటి ప్రిన్సిపాల్ సెక్రటరీతో పలుమార్లు చర్చించి గజానికి 250 రూపాయలు చెల్లించే విధంగా జీ.ఓ.తీసుకొని వచ్చామని తెలిపారు. ఆదేవిధంగా చింతల కుంట పల్లవి గార్డెన్స్‌లో జరిగిన దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం దసరా దీపావళి సమ్మేళన కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా మాజీ మంత్రివర్యులు పొన్నాల లక్ష్మయ్య, ఎల్బీనగర్ బారాస పార్టీ అభ్యర్థి, శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో ని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరిగిందన్నారు. ఇంక కొన్ని పనులు మిగిలి ఉన్నాయని వాటిని కూడా ప్రణాళికబద్ధంగా పరిష్కారం చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. అందుకు మీ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీల వారికి ఏ గల్లీ ఎక్కడ ఉంది కూడా తెలియదని, అలాంటి వారు కొత్తగా వచ్చేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, నియోజకవర్గం మీద గట్టి పట్టు నాకు ఉందని, రాబోయే రోజుల్లో చేయబోయే అభివృద్ధి పనులు మీద ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్‌చౌదరి, సామ బుచ్చిరెడ్డి, సుమన్‌గౌడ్, శివశంకర్, పోగుల రాంబాబు, కాజా శ్రీనివాస్, జగన్మోహన్‌రావు, పలువురు నాయకులు, పలు కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బిజెపి వ్యతిరేకులు కాంగ్రెస్‌లో చేరి నన్ను గెలిపించండి: కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 22 ప్రభాతవార్త:** బిఆర్ఎస్, బిజెపిలను వ్యతిరేకించే వారు కాంగ్రెస్‌పార్టీలో చేరి తనగెలుపుకు సహకరించాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కీలక నాయకుడు, మాజీ ఎంపిటిసి పోరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల మహేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిద్దాల ఆగమయ్య, మాజీ వార్డు మెంబర్ కోట్యా నాయక్, మధు నాయక్, శివ నాయక్, మోతిలాల్ నాయక్ తదితరులు కెఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెఎల్‌ఆర్ డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, చిగిరింత నర్సింహారెడ్డి, పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, సిద్దాల ఆగమయ్య తదితరులతో కలిసి పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు కాంగ్రెస్ పార్టీయే ప్రత్యామ్నాయమని అన్నారు. బిఆర్ఎస్‌ను ఓడించడం కాంగ్రెస్ వల్లే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతునిచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైతే కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డులను అర్హులైన వారికి అమలు చేయిస్తానని హామీనిచ్చారు.

**కెఎల్‌ఆర్‌ను గెలిపించండి: ఎపి కాంగ్రెస్ అధ్యక్షుడు రుద్రరాజు...** మహేశ్వరం నియోజకవర్గంనుండి కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పిలుపునిచ్చారు. రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడ గాయత్రీ నగర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరించి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.


కెఎల్‌ఆర్ సమక్షంలో చేరిన కురుమ సంఘం, బిఆర్ఎస్ నాయకులు


కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎపి కాంగ్రెస్ అధ్యక్షుడు రుద్రరాజు

ఈ కార్యక్రమంలో కందాల బాబు, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, కొప్పుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం : బండారి లక్ష్మారెడ్డి


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు


క్రిస్టియన్ సోదరుల సమావేశంలో ప్రసంగిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబర్ 22 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం జరుగుతుందని, ప్రజల కోసం పాటుపడే వారికి ఓటు వేసి గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ ముదిరాజ్ సంఘం భవనంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా రాణించేందుకు తన వంతు కృషి చేస్తానని, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ముదిరాజ్ భవనం మరో అంతస్థుతోపాటు, వారికి తగు చేయూత అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్థులు బండారి లక్ష్మారెడ్డికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, సంఘం నేతలు అరటికాయల భాస్కర్, బోరంపేట రామరాజు, మామిళ్ల చంద్రుడు, ఈగ సంతోష్, కొక్కొండ జగన్, పిల్లి నాగరాజు, వెంకటేష్, రాపాక వెంకటేష్, చంద్రశేఖర్, కవిత, ఝాన్సీ, అరటికాయల కృష్ణ, బోరంపేట హరికృష్ణ, పలువురు నేతలు పాల్గొన్నారు.

**బిఎల్‌ఆర్‌కు క్రైస్తవ సోదరుల మద్దతు :** క్రైస్తవుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు చిలుకానగర్ న్యూరాంనగర్ కాలనీలో ఇమాన్యుల్‌రాజ్, నీలిమ నూతన మందిర ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని, వారి సంక్షేమానికి తన వంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. క్రైస్తవులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, పల్లె నర్సింగ్ రావు, పాస్టర్ జికెబాబు, జేమ్స్‌రాజు, పీటర్ పాల్, రాజరత్నం, పరంజ్యోతి, పార్టీ నేతలు గొల్లూరి అంజయ్య, వి.బి.నరసింహా, కొండల్‌రెడ్డి, పిట్టల నరేష్, మాస శేఖర్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

# ఊహించని రీతిలో అభివృద్ధి చేశా : సబితా ఇంద్రారెడ్డి


బడంగ్‌పేట్‌లో ప్రసంగిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి


ప్రచారంలో ప్రసంగిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఎల్‌బినగర్, నవంబర్ 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఎవ్వరూ ఊహించని రీతిలో అభివృద్ధి చేశా.. స్థానిక కార్పొరేషన్ ప్రజలు దీనిని గమనించి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించి శివనారాయణ పురం బస్టాండ్, బడంగ్‌పేట్ బస్టాండ్, గాంధీనగర్ చౌరస్తాలలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రజా భవన్, ఆసుపత్రి, క్రీడా మైదానం, కళాశాలలు, నూతన కార్పొరేషన్ భవనం, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయం నిర్మించి పార్కులు అభివృద్ధి చేశామని వివరించారు. వరద సమస్యల పరిష్కారానికి నాళాలు, ట్రంక్ లైన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఐదేళ్లక్రితం బడంగ్‌పేట్ ఏవిధంగా ఉండె.. నేడు ఎలా ఉందో అనేది అందరూ గమనించాలన్నారు. సిఎం కెసిఆర్ స్ఫూర్తితో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించామని ఆమె అన్నారు. తాను చేసిన అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని మరువకుండా గుర్తుంచుకొని ఈ ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాలని ఆమె కోరారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు.

**నిజమైన ప్రజా నాయకురాలు సబితా ఇంద్రారెడ్డి: కార్తీక్‌రెడ్డి..** ప్రజా ప్రతినిధిగా నిత్యం ప్రజల మధ్యే ఉండే సబితా ఇంద్రారెడ్డే నిజమైన ప్రజా నాయకురాలని బిఆర్ఎస్ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన కాంగ్రెస్ మహిళాధ్యక్షురాలు పేట జ్యోతి, నాయకులు పేట నర్సింహ, తాండ్ర నర్సింహ, మహిళా నాయకురాలు లావణ్య తదితరులు కార్పొరేటర్ సిద్దాల లార్డ్స్ బీరప్ప ఆధ్వర్యంలో కార్తీక్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గులాబి కండువాలు వేసి ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ సబితమ్మ వల్లే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని గుర్తించిన పలువురు బిఆర్ఎస్‌లో చేరడం హర్షణీయమన్నారు. రానున్న కాలంలో సబితమ్మ సారథ్యలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ప్రజలు ఆమె నాయకత్వాన్ని సమర్థించి బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని కార్తీక్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ యాదవ్, ఉయ్యాల నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మహేశ్వరం మరో ఐటి హబ్:మంత్రి సబితా ...** నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని మహేశ్వరం మరో ఐటి హబ్‌గా తయారవుతుందని వేలాదిమందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు బస్తీలలో రోడ్‌షో నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం కేసీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ విశ్వనగరంగా మారుతుందన్నారు. 5వేల డబుల్‌బెడ్‌రూమ్‌లు సరూర్‌నగర్, ఆర్‌కెపురం డివిజన్లకు మంజూరు చేశామన్నారు. పట్టణాల రూపురేఖలను మార్చి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకురావడమే బిఆర్ఎస్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోయిని మహేందర్‌యాదవ్, పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి, లోకసాని కొండల్‌రెడ్డి, దర్పలి అశోక్, ఇంటూరి అంకిరెడ్డి, రిషి పాల్గొన్నారు.

## చాయ్ సేవలు అందరికీ ఆదర్శం:మాజీ ఐఏఎస్

**ఎల్‌బినగర్, నవంబర్ 22 ప్రభాతవార్త:** బుద్ధి మంద్యత దివ్యంగుల కొరకు నవదర్శన్ ప్రాజెక్ట్ ఆవిష్కరణ రాష్ట్రంలో మేధోవైకల్యమున్న పిల్లలకు సాధికారత కల్పించడంకోసం కాథలిక్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(చాయ్) సేవలను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఐఏఎస్ జగదీశ్వర్ అన్నారు. వి-గార్డ్ సహకారంతో చాయ్ ఆధ్వర్యంలో నవ ధరషన్ అనే కొత్త ప్రాజెక్ట్‌లో మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా 10 ప్రత్యేక పాఠశాలల నుండి 1000మంది మేధో వైకల్యం ఉన్న పిల్లలు ప్రయోజనం పొందుతారని తెలిపారు. విద్య, చికిత్స, వృత్తి నైపుణ్యాల మద్దతు ద్వారా పిల్లలను శక్తివంతం చేయడం, వారి జీవితాల్లో అభివృద్ధికి సహాయపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో వి గార్డ్ మాథ్యూ అబ్రహం, జాయింట్ డైరెక్టర్ మోతి, శ్రీకుమార్, ఆంటోనీ సెబాస్టియన్, బాబుఆరావల్, ప్రదీష్, విశాల్‌గుప్తా పాల్గొన్నారు.

# కెసిఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి : మర్రి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

**మల్కాజిగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త :** మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి 138వ డివిజన్ పరిదిలో శంకరయ్య కాలనీ, ద్వారకామాయి, ఆర్టీసీకాలనీ, సఫినగర్, భరత్‌నగర్, న్యూ వెంకటేశ్వరకాలనీ వాసులతో సమావేశమై రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి మద్దతు కోరుతూ అమీనుద్దీన్‌తో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలు సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కేసీఅర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని భవిష్యత్‌లో మరింత అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే కారుగుర్తుకు ఓటువేసి బిఆర్ఎస్‌ను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో తనను గెలిపిస్తే అన్ని రంగాలలో అభివృద్ధి చేసే బాధ్యత నాదే అని మల్కాజిగిరి బిఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మల్కాజిగిరి, మౌలాలి, ఆర్టీసీ కాలనీ, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ అమీనుద్దీన్ కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు భాగ్యానంద రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సరూర్‌నగర్‌లో ఓపిఓలకు శిక్షణ

**ఎల్.బి.నగర్, నవంబర్ 22 ప్రభాతవార్త:** సరూర్‌నగర్‌లోని జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో ఓపిఓలకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఓపిఓలు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుటకు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయగా 1262 ఓపిఓలు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ సథురప్పన్, తహసిల్దార్ బి. సునీత, ప్రాజెక్టు అధికారి విక్రాంత్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు

# స్థానికుడినైన నన్ను గెలిపించండి.. సేవకునిగా ఉంటా: అందెల శ్రీరాములు


అల్మాస్‌గూడ కాలనీల్లో ప్రచారం చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, నవంబర్ 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంనుండి పోటీ చేస్తున్న వారిలో స్థానికుడినైన తనకు ఒక్క అవకాశమిచ్చి చూడాలనీ జీవితాంతం ప్రజాసేవకునిగా ఉంటానని నియోజకవర్గఓటర్లకు బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ కాలనీల్లో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ, రోడ్ షోలలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను నమ్మితే ఇక అధోగతేనని అన్నారు. తాను మాట తప్పనని పార్టీ మారనని తనను విశ్వసించి ఓటు వేసి గెలిపిస్తే పారదర్శకంగా పని చేస్తానని అందెల స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నిజాయితీతో నిర్భయంగా పని చేసి సుపరిపాలన అందిస్తానని తెలిపారు. 2వసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనపై సానుభూతి చూపి ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు. కాగా అందెల ప్రచారానికి మంచి స్పందన లభించింది. మహిళలతు మంగళ హారతు లతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, జక్కిడి జంగారెడ్డి, శూరకర్ణారెడ్డి, వీరకర్ణారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుస్తా.. రాష్ట్రంలో కీలక బాధ్యత వహిస్తా : మధుయాష్కి


ఆటోలో ప్రయాణిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మధు యాష్కిగౌడ్

**ఎల్‌బినగర్, నవంబరు 22 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గంలో నీతి నిజాయితీగా పనిచేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరిగా నెరవేరుస్తానని ఎల్బీనగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డివిజన్ల బూతు శిక్షణ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై బూతు నాయకులకు, సభ్యులకు దిశానిర్దేశం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలను ఇంటింటి కార్యక్రమంలో భాగంగా ప్రతిఇంటికి చేరవేయాలని కోరుతూ బూతు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త మధుయాష్కి మాదిరిగా ఇంటింటికి తిరిగి వాళ్ళ సమస్యలు తెలుసుకొని నా తరపున మీరు వాళ్లకు మాటఇవ్వలని, మీరు ఇచ్చిన ప్రతి మాట నెరవేరుస్తానని అన్నారు. నీతినిజాయితీ గల నాయకుడిగా తప్పకుండా ప్రజల కోసం పనిచేస్తానని హయత్‌నగర్‌లోనే పుట్టాను హయత్‌నగర్‌లోనే ఉంటాను, ఈ గడ్డను విడిచి పెట్టే ప్రసక్తేలేదని భరోసా ఇచ్చారు. ఈ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్టార్జితం మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాది అన్నారు. రేపు మీ అన్నగా ఎమ్మెల్యేగా గెలిస్తే రాష్ట్రంలో ఏర్పాటు చేయ కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక బాధ్యత వస్తుంది దానికి కూడా కారణం మీరే అవుతారని తెలిపారు.ఎవరి కుట్రలకు బెదిరింపులకు భయపడనవసరం లేదు కుట్రలు కుతంత్రాలు నాకు రావు కానీ నా వైపు ధర్మం ఉంది ఈ ధర్మ యుద్ధంలో గెలుపు కాంగ్రెస్‌దే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, నాయకులు శేఖర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, షాలిని తదితరులు పాల్గొన్నారు.

# నేరెడ్‌మెట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిల్లల కోసం - తొలిమెట్టు కార్యక్రమం


తొలిమెట్టు కార్యక్రమంలో వాలంటీర్లతో ప్రిన్సిపల్ ఎం శైలజ, సిబ్బంది..

**నేరెడ్‌మెట్, నవంబర్ 22 ప్రభాతవార్త:** వెనుకబడిన విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించడమే కాకుండా పలు సహాయక కార్యక్రమాలు చేయడానికి వాలంటీర్లు ముందుండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం శైలజ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ సేవా విభాగం వాలంటీర్లకు పలు ప్రాథమిక పాఠశాలలను కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి శనివారం వాలంటీర్లు వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్ళి వెనుకబడిన విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు విద్యలో పలు మెలకువలను నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపల్ బండి రాజు, జాతీయ సేవా విభాగం అధికారి రమేష్, జగన్, మల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది బిజెపి మాత్రమే : సామ రంగారెడ్డి


బిజెపి మేనిఫెస్టో విడుదల చేస్తున్న సామ రంగారెడ్డి

**ఎల్‌బినగర్, నవంబరు 22 ప్రభాతవార్త:** ప్రజలఆకాంక్షలకు అద్దం పట్టేది ఒక్క బీజేపీ మ్యానిఫెస్టో మాత్రమే అని, కోర్టు కేసులు, తప్పుడు జీవోల సాకుతో హామీలను నెరవేర్చని సుధీర్‌రెడ్డికి అసెంబ్లీ ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని ఎల్బీనగర్ బిజెపి అభ్యర్థి సామా రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. హయత్‌నగర్‌లో ఆడిటోరియం ఏర్పాటు చేస్తామని, కబ్జాల బారి నుంచి ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ బిజెపి కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్లతో కలసి స్థానిక మ్యానిఫెస్టోను సామా రంగారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను బంధుప్రీతి లేకుండా అర్హులైన అందరికీ చేరువయ్యేలా చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలు మాయ హామీల కరపత్రాలన్నారు. ఈ మ్యానిఫెస్టోను కూడా క్షేత్ర స్థాయిలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించామన్నారు. బీజేపీ అధికారంలోకి ఎల్‌బీనగర్ పబ్లిక్ మ్యానిఫెస్టోలోని హామీలను కూడా కార్పొరేటర్ల సహకారంతో నెరవేరుస్తానని అన్నారు. బిఆర్ఎస్ ఎన్నికల సమయంలో హామీలను పరిష్కరిస్తున్నట్టుగా తప్పుడు ప్రచారం చేసుకుని, కోర్టు కేసుల వల్ల సమస్య పరిష్కారం కాలేదని, జీవోలో తప్పులు ఉన్నాయని, మరోసారి అవకాశం ఇస్తే వాటిని నెరవేరుస్తామని ఓట్ల కోసం వచ్చే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ, గెలిచిన తర్వాత పార్టీ మారిన అవినీతికి పాల్పడి కోట్లు గడిచారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం నిధులతో యూజీడీ, స్ట్రామ్‌వాటర్ ప్రధాన పైప్‌లైన్లను రోడ్లు ధ్వంసం కాకుండా టన్నెల్‌ద్వారా ఏర్పాటుచేసే పైప్‌లైన్‌వల్ల హయత్‌నగర్, నాగోల్, మన్సూరాబాద్, బీయన్‌రెడ్డినగర్, కొత్తపేట డివిజన్ల సమస్య పరిష్కారమవుతుందన్నారు. హయతనగర్ ఆర్టీసీబస్టాండ్ వెనక ఖాళీస్థలంలో ఆడిటోరియం ఏర్పాటు, చెరువులు కబ్జాకు గురికాకుండా పరిరక్షించి, సుందరీకరణకు చర్య లు చేపడతామన్నారు. సర్వే నెం.58 ఫత్తులగూడలోని నిరుపేదలందరికీ ఇంటి స్థలాల పట్టాలు ఇప్పిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాలనీలు ముంపుకు గురికాకుండా కాపాడుతామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు నాయికోటి పవన్‌కుమార్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కొప్పుల నర్సింహ్మారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్‌రెడ్డి, వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంవిఎస్‌ఆర్ కళాశాల వ్యవస్థాపక సభ్యుడు పురుషోత్తం కన్నుమూత

**సరూర్‌నగర్, నవంబర్ 22 ప్రభాతవార్త:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఒకటైన నాదర్‌గుల్ ఎంవిఆర్ఎస్ ఇంజనీరింగ్ కాలేజీ వ్యవస్థాపక సభ్యుడు, కాలేజీ మాజీ ఛైర్మన్ ఎంబిఎస్ పురుషోత్తం కన్నుమూశారు. ఆయన వయస్సు 91 సంవత్సరాలు. వృద్యాప్య అనారోగ్య కారణాలతో ఆయన మృతి చెందారు. నాలుగు దశాబ్దాల క్రితం ఎంవిఎస్‌ఆర్ కాలేజీ ఏర్పాటులో చురుకైన పాత్ర వహించిన ఆయన మృతి పట్ల కాలేజీ ఛైర్మన్ డాక్టర్ కెపి శ్రీనివాసరావు, సెక్రటరీ కృష్ణకుమార్, కోశాధికారి జూపూడి సుధాకర్, సభ్యులు వాసుదేవరావు, కశ్యప్, జితేంద్రనాథ్‌లతో పాటు పలువురు అదే విధంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జిఎస్ మూర్తి, ప్రసన్నకుమార్ తదితరులు సంతాపం వ్యక్తం చేసి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుషోత్తం అందించిన సేవలను కొనియాడారు.